క్లుప్తంగా

రేపు అవగాహన కార్యక్రమం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ దగ్గర ఎస్పీ ఆదేశాల మేరకు, ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, నాయకులు హాజరు కావాలని పేర్కొన్నారు.

23న అవగాహన సదస్సు

ధరూరు: ఈ నెల 23న సాయంత్రం మండల కేంద్రంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా డయల్ 100 ప్రాముఖ్యత, బాల్య వివాహాలు–అనర్థాలు, ట్రాఫిక్ నియమాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత మొదలగు అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజవంతం చేయాలని ఆయన కోరారు.

గురుకులాలకు విద్యార్థుల ఎంపిక

శాంతినగర్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గురుకులాల్లో ఐదో తరగతిలో చేరేందుకు నిర్వహించిన పరీక్షలో వడ్డేపల్లి పురపాలిక, మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పదుల సంఖ్యలో ఎంపికయ్యారు. పేద విద్యార్థులకు గురుకులాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పలువురు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

23న కమ్యూనిటీ అవగాహన కార్యక్రమం

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్ నగర్ గ్రామంలో ఈనెల 23న కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాన్ని ఎస్పీ ఆదేశాల మేరకు, ఎస్‌ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

సకల సంపదలకన్న.. చదువు మిన్న

మల్దకల్: సమాజంలో మానవుడికి సకల సంపదలకన్న చదువే మిన్న అని ప్రధానోపాధ్యాయుడు సురేష్ అన్నారు. శనివారం మల్దకల్ ఇన్‌చార్జి ఎంఈఓ కొండారెడ్డి పదవీ విరమణ సమావేశంలో మాట్లాడారు. మానవుడికి విద్య ఎంతో అవసరమని, ఈ విద్యను ఎంత మందికి పంచితే సమాజంలోని మనుషులందరు అంత రెట్టింపులో వృద్ధి చెందుతారన్నారు. అనంతరం కొండారెడ్డి దంపతులకు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, నరేష్, మునెప్ప, రాజశేఖర్, తిమ్మప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతు



కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నె గ్రామంలో కొన్ని రోజులుగా విద్యుత్ లైన్లకు చెట్లు తగలడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ లైన్‌మెన్ ఆనంద్‌నాయక్ ఆధ్వర్యంలో చెట్లను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

ముళ్ల పొదలు తొలగించండి



అయిజ: మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలో రోడ్డు పక్కన ముళ్ల పొదలు దట్టంగా పెరుగడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముళ్ల పొద ఉన్న స్థలంలో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో కర్నూల్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా శనివారం దాడి చేసి పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ వివరాల ప్రకారం.. కర్నూల్ పట్టణం కల్లూరు వీకేర్ సెక్షన్ ఏరియాకు చెందిన ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా, పట్టుకుని వారి వద్ద ఉన్న రూ.2500 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఉప్పు నీరే దిక్కాయే..!

- అరకొరగా మిషన్ భగీరథ నీరు
- చేతిపంపులు, బోరు బావుల్లోనూ ఉప్పు నీరే..
- ముందస్తు ప్రణాళికతో నీటి సమస్యకు పరిష్కారం
- చేతిపంపులు, బోరు బావుల మరమ్మతు చేయాలి
- ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం: అధికారులు



జూలెకల్‌లో చేతిపంపు వద్ద నీటిని తెచ్చుకుంటున్న చిన్నారులు

శాంతినగర్: ఐదేళ్లుగా ఇంట్లోనే కులాయి నీటిని పట్టుకుని ఫిల్టర్ నీటిని తాగుతూ ఇబ్బందులు లేకుండా జీవనం సాగిస్తున్న ప్రజలకు ఇప్పుడు చేతిపంపుల్లోని ఉప్పు నీరే దిక్కవుతోంది. గతంలో ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లు రావడంతో తాగు నీటి సమస్యలేకుండా కాలం గడిపారు. ఏడాది కాలంగా నీటి సరఫరాలో కొరత ఏర్పడటంతో కొందరు మిషన్‌భగీరథ పైప్‌లైన్‌లకు అమర్చిన గుండీలు తొలగించి అక్రమంగా నీటిని వాడుకుంటున్నారు. కొందరు అన్ని అవసరాలకు ఫిల్టర్ నీటిని వాడుకుంటూ లబ్ధి పొందుతుండగా మరి కొందరు తాగడానికి నీరులేక అవస్థలు పడుతున్నారు. గుండీలు తొలగించిన ఇళ్ల వారికి నోటీసులు అందజేశారు గాని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, గుండీలు తిరిగి అమర్చకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడుతోంది. అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో యథా రాజా తదా ప్రజా అన్నచందంగా తయారైంది గ్రామాల్లో పరిస్థితి. చేతిపంపుల వద్దకు వెళ్లి లైన్లో నీటిని తెచ్చుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. నీటి సమస్య ఉన్నందున ఇంట్లో ఆడుకునే పిల్లలు సైతం చేతిపంపుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకొని తాగాల్సి వస్తోంది. కోట్లు వెచ్చించి పైప్‌లైన్లు, నల్లాలు ఏర్పాటు చేసినా చివరికి చేతిపంపుల్లోని ఉప్పునీరే దిక్కవుతోందని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి మిషన్ భగీరథ కుళాయిలకు గుండీలు ఏర్పాటుచేసి అందరికి సమానంగా ఫిల్టర్ నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేయడంతో..

వడ్డేపల్లి మండల పరిధిలోని పది గ్రామ పంచాయతీల్లో చేతిపంపులు, బోరు మోటార్లు మరమ్మతులు చేపట్టడంతో నీటి సమస్య కొంతమేర తగ్గింది. మండలంలో మొత్తం 62 చేతిపంపులు ఉండగా వాటిలో 46 చేతిపంపులకు మరమ్మతులు చేయించినట్లు ఏఈ పేర్కొన్నారు. 16 పనిచేయవని, మిగతా చేతి పంపులకు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అంతేగాక సింగిల్ ఫేస్, త్రీ ఫేస్ మోటార్లకు మరమ్మతులు చేయించడంతో ప్రస్తుతం నీటి సమస్యకు చెక్ పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. అధికారులు చేపట్టిన చేతిపంపులు, బోరుబావుల మరమ్మతు పనులతో నిత్యవసరాలకు అవసరమయ్యే నీటి సమస్య తీరిందని, తాగడానికి ఫిల్టర్ నీరు అందడంలేదని చెబుతున్నారు.

ఆయా గ్రామాల్లోని మిషన్ భగీరథ కొలాయిలకు అమర్చిన వాల్స్‌ను కొందరు తొలగించడంతో వారు నిత్యవసరాలకు ఫిల్టర్ నీటిని వాడుతున్నారు. మిగతా వారు చేతిపంపుల్లోని ఉప్పు నీటిని (ఫ్లోరైడ్ నీటిని) తాగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యదర్శులకు చెప్పినా ఫలితం లేదు..

ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు నీటి సమస్య ఉందని, కులాయిలకు నీరు రావడం లేదని ఫిర్యాదు చేసినా ఫలితం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శులు మాత్రం నోటీసులు ఇచ్చి చేతులు దులుపేసుకుంటున్నారు తప్ప నీటిని అక్రమంగా వాడుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవడంలేదని వాపోతున్నారు. దీంతో చేతిపంపులు, బోరు బావుల్లోని ఉప్పు నీటిని తాగుతున్నట్లు పేర్కొన్నారు.

చేతి పంపుల వద్దకు వెళ్లాల్సిందే



మిషన్ భగీరథ నీరు గతంలో వచ్చిన మాదిరి రావడంలేదు. నీటి కొరత ఉండటంతో ఇటీవల చేతి పంపులకు మరమ్మతు చేయించారు. దూరంలో ఉన్న చేతిపంపు వద్దకు వెళ్లి గంటల తరబడి నిలబడి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఫిల్టర్ నీరు ఎప్పటిలాగే వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. మాకు మాత్రం ఫిల్టర్ నీరు సరిగా రావడంలేదు. అన్ని కులాయిలకు నీరు సమానంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

– శ్రీను, జూలెకల్, వడ్డేపల్లి

అనారోగ్యాల బారిన పడతాం..



మిషన్ భగీరథ నీరు సరిగా రాకపోవడంతో ఇటీవల మరమ్మతులు చేయించిన బోరు బావులు, చేతిపంపుల్లోని ఉప్పు నీటిని తెచ్చుకుని తాగుతున్నాం. కొందరికేమో ఫిల్టర్ నీరు బాగా వస్తున్నాయి. మాకు తాగడానికి సరిపోవడంలేదు. ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నాం. అందరికి సమానంగా మిషన్‌భగీరథ నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– ఆంజనేయులు, జూలెకల్, వడ్డేపల్లి

పూర్తి స్థాయిలో మరమ్మతు చేపట్టాం

ఫిల్టర్ నీరు పూర్తిస్థాయిలో అందకపోవడంతో నీటి కొరత తీర్చడానికి గత పదిహేను రోజులుగా ఆయా గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న 46 చేతిపంపులకు మరమ్మతులు చేపట్టాం. సింగిల్‌ఫేస్, త్రీ ఫేస్ మోటార్లకు మరమ్మతులు చేపట్టి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. 16 చేతిపంపులు డెడ్ అయినవి. కొన్నింటికి మరమ్మతులు జరుగుతున్నాయి. బోరు బావులు అందుబాటులోకి తెచ్చాం. ఎఫ్‌సీవీలు (గుండీలు) తొలగించడంవల్ల సమస్య తలెత్తుతోంది. గుండీలు తొలగించిన వారికి నోటీసులు అందజేశాం.

– వంశీసాగర్, ఏఈ, వడ్డేపల్లి

అవగాహనతోనే ప్రమాదాల నివారణ



అలంపూర్ చౌరస్తాలో ప్రయాగ్ పాఠశాలలో విజేతలతో ఫైర్ అధికారులు ఉపాధ్యాయులు

- ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి అధికారి కురుమూర్తి
- ముగిసిన అగ్ని ప్రమాదాల అవగాహన వారోత్సవాలు

అలంపూర్: అవగాహనతోనే ప్రజలు అగ్ని ప్రమాదాలను నివారించుకోవచ్చని ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి అధికారి కురుమూర్తి అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ప్రయాగ్ పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అగ్ని ప్రమాదాల జాగ్రత్తలు, నివారణ చర్యలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి కురుమూర్తి బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 13వ నుంచి 20వ తేదీ వరకు అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. 1944 ఏప్రిల్ 14న విక్టోరియాలోని ఓడ రేవు వద్ద నౌకలోని పైభాగంలో పత్తి, కింది భాగంలో మందు గుండు సామగ్రితో సముద్ర ప్రయాణం జరిగినట్లు విద్యార్థులకు వివరించారు. నౌకలో అగ్ని ప్రమాదం సంభవించి పైభాగంలోని పత్తికి నిప్పంటుకుందని సమాచారంతో ఫైర్ సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో కింద ఉన్న మందుగుండు సామగ్రి ఒక్కసారిగా పేలినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో 231 మంది ఫైర్ సిబ్బంది మృతి చెందగా, మరో 476 మంది ఫైర్ సిబ్బంది క్షతగాత్రులైనట్లు తెలిపారు. ఈ సంఘటన జరిగినప్పటి నుంచి దేశ వ్యాప్తంగా ఫైర్ సిబ్బందితో పాటు సామాన్య ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతులు అగ్ని ప్రమాదాలపై అవగా హన పెంచుకోని అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

కేటీదొడ్డి: రాయచూర్ నుంచి ధరూర్ మండలం నాగర్‌దొడ్డి వైపు అక్రమంగా 10 క్వింటాళ్ల చికెన్ వ్యర్థ పదార్థాలను తరలిస్తున్న వాహనాన్ని కేటీదొడ్డి పోలీసులు శనివారం పట్టుకున్నట్లు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు చికెన్ వ్యర్థాలను క్యాట్‌ఫిష్‌కు వినియోగిస్తున్నట్లు తేలింది. దీంతో వాహన డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



అలంపూర్: కర్నూల్‌లోని నివాసంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహంను నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు శనివారం కలిసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జన్మదినం కావడంతో ఆయను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు సుగణమ్మ, రాజు, నాయకులు అజయ్, ముగెన్న, రమణ, పుల్లన్న, మహేష్, శేక్షావలి, అనిల్, మధు, రాజు ఉన్నారు.

వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వాహనాల తనిఖీ చేపడుతున్నారు. శనివారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు, ఎన్నికల అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల్లో పెద్ద ఎత్తున నగదు మద్యం, సారా తరలిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన రశీదులను చూపించాల్సి ఉంటుందన్నారు. తనిఖీలో ఎస్‌ఎస్‌టీం హేమంత్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గోపాల్ నాయుడు, లక్ష్మణ్, జగదీష్, వాస్రం నాయక్, ప్రేమ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పాడి రైతులకు రుణాలు

అయిజ: జిల్లాలో పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు పాలు పోసేటటువంటి రైతులందరికి రుణాలను ఇవ్వనున్నట్లు డెయిరీ మేనేజర్ రాజు తెలిపారు. శనివారం మండలంలోని కేశవరం గ్రామంలో రైతులకు చెక్కులు అందజేశారు. రుణాల ద్వారా కొనుగోలు చేసిన పాడి పశువులకు ఇన్సూరెన్స్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

గద్వాలరూరల్: గద్వాల మున్సిపాల్టీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, పట్టణ ప్రజలకు అందాల్సిన కనీస సౌకర్యాలు అందడం లేదని, ప్రవర్తన మార్చుకోకపోతే సహించేది లేదని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, కమిషనర్ శంకర్‌సింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ తన చాంబర్‌లో కమిషనర్ శంకర్‌సింగ్ శానిటరీ విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గద్వాల పట్టణంలోని 37 వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ అధ్వానంగా ఉందని, పలు వార్డుల నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణపై రోజు వారి నివేదిక కోరగా, అధికారుల వైపు నుంచి సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో వారిపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవర్తన మార్చుకుని ప్రజలకు అందించాల్సి సేవలు పకడ్బందీగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.అధికారులు ప్రవ ర్తన మార్చుకోవాలని వివాదం పెద్దగా కాకుండా సర్దుబాటు చేశారు. దీనిపై చైర్మన్ కేశవ్ సాక్షితో మా ట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్య లు తీసుకుంటామన్నారు. పారిశుద్ధ్య నిర్వహన చెత్తసేకర, నీటి సమస్యలపై అధికారులతో కలిసి పనిచేస్తున్నామని మున్సిపల్ కమిషన్ శంకర్‌సింగ్ చెప్పారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మానవపాడు: క్షణికావేశానికి గురై మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన సాదిక్ పాషా(26) కూలీ పనులకు వెళ్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం తాగి ఇంటికొచ్చాడు. అన్నంపెట్టమని తల్లిని అడిగాడు. అన్నంలేకపోవడంతో వండి పెడతానని చెప్పి ఇంట్లోకి వెళ్లింది. ఈ క్రమంలో క్షణికావేశానికి గురైన అతను ఇంట్లో రంగుల్లో కలిపే టిన్నర్ కెమికల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. దీన్ని గమనించిన తల్లి, చుట్టుపక్కల వారు మంటలు ఆర్పి వెంటనే కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం సాయంత్రం ఈశ్వర్ గద్వాల నుంచి పూడూర్‌కు బైక్‌పై రూ.18 వేల విలువైన మద్యం తరలిస్తున్నాడు. పట్టణ శివారులో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు మద్యం పట్టుకున్నారు. స్వాధీనం చేసుకుని ఈశ్వర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్యాలెండర్ పంపిణీ

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులకు త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను త్రైత సిద్ధాంత సేవాసమితి సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత సేవాసమితి మండల అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి మాట్లాడారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే విధంగా క్యాలెండర్ రూపొందించినట్లు తెలిపారు.

భక్తులతో పోటెత్తిన ఆదిశిలాక్షేత్రం



ఆదిశిలా క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆదిశిలా క్షేత్రంలో భక్తులకు అన్నదానం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులతో ఆదిశిలాక్షేత్రం ఆవరణం నిండింది. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కొంత మంది భక్తులు స్వామి వారికి దాసంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాలలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, చంద్రశేఖర్‌రెడ్డి, బాబురావు, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ, వాల్మీకి, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



బల్గెరలొ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్యామల

గట్టు: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జెడ్పీటీసీ బాసు శ్యామల సూచించారు. శనివారం బల్గెరలో ప్రీమియర్ లీగ్ క్రికెట్‌ను జెడ్పీటీసీ, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బల్గెర హనుమంతునాయుడులు ప్రారంభించారు. బల్గెర గ్రామంలో నిర్వహించే శ్రీదిగంబర స్వామి ఉత్సవాల సందర్భంగా ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ క్రీడాకారులను పరిచయం చేసుకొని అనంతరం బ్యాట్ పట్టుకుని క్రికెట్‌ను ప్రారంభించారు. ప్రతి జట్టు గెలుపు కోసం చివరి దాకా పోరాడాలని సూచించారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రూపవతి, రాయాపురం వీరేష్, బాసు నాయుడు, యల్లందొడ్డి రాజు, బాసు గోపాల్, పటేల్‌రాజు, రామకృష్ణ, తిమ్మారెడ్డి, డీఆర్ నాయుడు, ఈరన్న, వినోద్, బుగ్గల్ పాల్గొన్నారు.

ఆటాపాటలతో చిన్నారులకు చదువు



ఇందువాసిలో చిన్నారులతో అంగన్‌వాడీటీచర్లు

గట్టు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటాపాటల ద్వారా చదువు వైపు దృష్టిని సారించడంతో పాటుగా పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండేలా చూస్తున్నారని అంగన్‌వాడీ సూపర్ వైజర్ వాసంతి తెలిపారు. శనివారం ఇందువాసి గ్రామంలో ఈసీసీఈ డేను నిర్వహించారు. 1,2,3,4,5 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే సందర్భంగా కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఏడాది పాటుగా అంగన్‌వాడీల్లో నేర్చుకున్న వాటిని తల్లిదండ్రుల ఎదుట ప్రదర్శించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వాసంతి మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు భరోసా అంగన్‌వాడీ కేంద్రాలే అని తెలిపారు. చిన్నారులకు విద్యతో పాటుగా ఆరోగ్యంగా ఉండే విధంగా పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీ విద్యను పూర్తి చేసుకున్న తర్వాత ప్రాథమిక పాఠశాలలో చేర్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యమ్మ, శ్రీలత, ఈరమ్మ, కావేరమ్మ, వీరమ్మ పాల్గొన్నారు.

బండారు వేసేందుకు తరలొస్తున్న భక్తులు



ధరూరుకు తరలి వచ్చిన వివిధ ప్రాంతాల భక్తులు

ధరూరు: కురువ కులస్తుల ఆరాధ్య దైవం బీరప్ప దేవునికి బండారు వేసేందుకు ఆయా ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తున్నారు. ఆదివారం వేసే బండారు కార్యక్రమానికి ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు. మండల కేంద్రంలోని చెరువు సమీపంలో ఉన్న ఆలయానికి భక్తులు రెండు రోజులుగా తరలొస్తున్నారు. భక్తులు వస్తుండడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణలోని ఆయా ప్రాంతాలతో పాటు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో వస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఎండల నేపథ్యంలో ప్రత్యేకంగా టెంట్లను ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యంగా ఈ బండారు కార్యక్రమంలో ఆదిగొండ్ల గోత్రం వారు మాత్రమే పాల్గొంటారని, రాష్ట్రాలు, ప్రాంతాలతో సంబంధం లేకుండా సమాచారం అందిన గ్రామాల నుంచి ఆ గోత్రం వారు పిల్లా, జల్లా తరలి వస్తున్నారు. చెరువులో దాదాపు 20 ఎకరాల్లో, పెట్రోలు బంకు సమీపంలోని 10 ఎకరాల విస్తీర్ణంలో వెలసిన బసన్‌గౌడ్ వెంచర్‌లో టెంట్లు వేసుకున్నారు. ప్రత్యేకంగా ట్రాక్టర్లు, జీపులు, బొలెరో వాహనాల్లో అధికంగా జనం తరలి వస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పంచాయతీ కార్యదర్శితో పాటు ప్రత్యేకాధికారులు, పంచాయతీ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరోగ్యకరమైన మొక్కలు పెంచాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటయ్య

అయిజ: మండలంలోని కొత్తపల్లి, మేడికొండ, రాజాపురం, బైనిపల్లి, పులకిల్ గ్రామాలను ఎంపీడీఓ వెంకటయ్య పరిశీలించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని విధాలుగా ప్రయత్నించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. ఆరోగ్య కరమైన మొక్కలను పెంచాలని సూచించారు. అనంతరం ఈజీఎస్ పనులను పరిశీలించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా 100 రోజుల పనిదినాలను మే నెల వరకు పూర్తి చేసుకోవాలని, కూలి రేటు 300 వచ్చేటట్లు కొలతల ప్రకారం పని చేయాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం..



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. శనివారం మండలంలోని చిన్నతాండ్రపాడులో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, భీంసేన్‌రావు, వెంకటేష్, అంజి, భీమన్న, రమేష్, సతీష్, నరసింహులు శివన్న పాల్గొన్నారు.

గట్టు: నాగర్‌కర్నూలు పార్లమెంట్ నియోజక వర్గ బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ తరపున బీజేపీ నాయకులు శనివారం గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనుల గురించి ఓటర్లకు వివరించారు. నాయకులు బల్గెర శివారెడ్డి, మాచర్ల వెంకటేష్, సురేష్, రమేష్, మహేష్, భీమయ్య, బ్రహ్మయ్య, బెల్లం నర్సింహులు, శ్రీరామ్‌గౌడు, బసప్ప తదితరులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో అనుసూయమ్మ కాలనీలో బీజేపీ నాయకులు ఇంటింటి చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిడుగు వెంకటేష్, ఒరదరాజులు, గోవర్ధన్‌రెడ్డి, ఉపేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభం

శాంతినగర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో నియోజకవర్గ బీజేపీ కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, సుస్థిర ప్రజాపాలన గుర్తించిన ప్రజలందరు మరోసారి బీజేపీ ప్రభుత్వాన్ని కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.